
# సిగ్గుపడ్డాను

- సుంకర శ్రీలత

జీవితం! జీవితం...అంటే ఇంతే! అంతా ఒక్కటే అని తెల్సు. అయినా ఊర్కోము. ప్రాకులాట, ప్రయాస. దుఃఖం భరిస్తూ, వేదన పడ్తూ, మెట్ట వేదాంతం వల్లిస్తూ – అంతలోనే ఏదో ఆశ! సుఖపడటానికి, ఏ కాస్త చిన్న అవకాశం వదలబుద్ధి కాదు. 'వ్యక్తి జీవితం చుట్టూ శాసనాలు, నియమాలు చేర్చి వ్యక్తి 'స్వేచ్ఛ'ను హరించి తన చుట్టూ తిప్పుకుంటున్న సంఘం చేతిలో నేనూ కీలుబొమ్మనే.



అరెరే! నేనేమిటి? ఇలా జీవితం అంటూ – మనిషంటూ ఏవేవో ఆలోచిస్తున్నాను. ఏమైంది? బహుశా ఏదో నిరాశ లేక అసహాయతకు సమర్థింపు కావచ్చు. అంతేనా! మొరుగుతున్నాయి, బయట కుక్కలు మొరుగుతున్నయ్. నాకేం భయం వేయడం లేదు. చిన్నప్పుడు ఎంత భయపడేదాన్ని. అంటే, ఇప్పుడు మారిపోయానా? మళ్లీ జీవితం గురించి ఆలోచనలు. మనిషి నుంచి ఆలోచనలు వేరు పడేదెప్పుడు? బయట పోస్ట్‌మన్ సైకిల్ బెల్ – నాకేం ఉత్తరాలు రాలేదు. ఓ తెల్లగౌను కాన్వెంటు పాప మా ఇంటి ఆవరణలో వున్నాగ వూలు ఏరుకోడానికి వస్తోంది. బాల్యం...తీయని బాల్యం. నేనూ ఆ వయసులో, అలా పరిగెత్తేదాన్ని. వూల కోసమో, బాదం కాయల కోసమో ఎవరో విసిరిన రాళ్లకు బుర్ర పగిలితే ఏడుస్తూ వచ్చేదాన్ని. రేపట్నుంచి వెళ్లకూడదని తీసుకునే గట్టి నిర్ణయం ఏమయ్యేదో తర్వాత రోజుకు. ఎవరో పొరపాటుగా విసిరిన రాయి నన్ను గాయపరిస్తే నే నెందుకు మానుకోవాలి వెళ్లటం? ఇప్పుడు అలాంటి ప్రశ్నే – వ్యవస్థ తన కోసం తన భద్రత కోసం కల్పించుకున్న చట్రంలోకి నన్ను ఇరికిస్తుంటే ఎందుకు ఊర్కోవాలి? అయితే, ఏం చేయాలనుకుంటున్నావ్? నీ మొహం ఏం చేయలేవు? ఎందుకు... ఎందుకు చేయలేను.? స్త్రీగా పుట్టిన తర్వాత సంఘం కట్టుబాట్లకు, నియమాలకు తల ఒగ్గాల్సిందే. లేక పోతే, భరించలేనంత అవమానాన్ని, అసహ్యాన్ని ప్రసాదిస్తుంది సంఘం. 'ఎటో వెళ్లిపోయింది మనసు...' టి.వి.లో పాట... అవును మనస్సు కాబట్టే దేనికీ లొంగకుండా ఎటైనా వెళ్తుంది, ఏమైనా ఆలోచిస్తుంది. కట్నాలు, కానుకలు ఇచ్చి, ఆత్మాభిమానం చంపుకుని పెళ్లి చేస్కోకపోతే నేం? ఎదురు తిరుగు, పోరాటం చేయి... అంటూ మెదడుకు ఏవేవో ఎక్కిస్తుంది. కానీ, 'స్త్రీ'గా పుట్టిన ఈ శరీరం ఒప్పుకోదు. ఇల్లు విడిస్తే తనకు రక్షణ లేదంటుంది. సంఘర్షణ! కన్పించని మనస్సుకు – సంఘం మర్యాదలు, విలువల చేత పోషించిన శరీరానికి మధ్య సంఘర్షణ.

ఆటో చప్పుడు – అమ్మ వచ్చేసింది.

అదిగో టింగ్ టింగ్...కాలింగ్ బెల్. అన్నయ్య వెళ్లి తలుపు తీస్తున్నాడు.

పెళ్లి బట్టలోచేత్తో, ఖాళీ అయిన పర్సు ఓ చేత్తో పట్టుకుని లోపలికొచ్చి కూర్చుంది అమ్మ ఆయాసపడుతూ.

పెళ్లి ఇంకెన్ని రోజులుంది? కేవలం పదిహేను రోజులు. అందరిలాగే నేనూ ఇల్లాలినవుతాను. ఈ సంసార జంఝాటంలో పడుతూ, లేస్తూ, 'మునకే సుఖం' అనుకుంటూ ఒడ్డుకేసి చూసే తీరికే లేకుండానే బతుకు తెల్లారిపోతుంది.

–పెళ్లంటే?

–రెండు జీవితాల కలయిక. చెప్పా పెట్టకుండా వయసొచ్చేస్తుందా! ఓ ఆడదానికి ఓ మగాడు తోడు కావాల్సిందే నంటుంది సంఘం – నిర్భయంగానైనా సరే.

సంఘం అంటే?

వ్యక్తుల కలయిక. వ్యక్తులంటే – మనమేగా! మరి మనిష్టం వచ్చినట్టు ఎందుకుండకూడదు? ఒకరికి జాజులంటే ఇష్టం కావచ్చు, ఇంకొకరికి జాబిలంటే ఇష్టం కావచ్చు. కొందరికి పుస్తకాలంటే ఇష్టం. ఇలా ఒక్కో వ్యక్తికి ఒక్కో రకమైన ఇష్టయిష్టాలున్నవుడు – నేను పెళ్లి చేస్కోను, అందులో కట్నమిచ్చి చేస్కోవటం అస్సలిష్టం లేదంటే ఒక్కరూ నామాట వినరేం?

'కవితా! ఏయ్ కవితా! ఈ చీరలు చూడు నీకు వచ్చుతాయో లేదో?' – అదిగో, అమ్మ వన్నే ఆడు

గుతోంది. ఫర్వాలేదు. కనీసం చీరలైనా వచ్చాయో, లేదో చెప్పటానికి స్వాతంత్ర్యం వున్నట్టే వుంది. పెళ్లి కొడుకు ఎలా వున్నాడు? ఏమో? పెళ్లిచూపులప్పుడు సరిగ్గా ఎక్కడ చూసాను? అసలు చూడనిస్తేగా? తలెత్తుకుని చూద్దామనుకుంటుండగానే లోపలికి పంపేశారు ఎవరో ముసలాయన. ఎప్పుడు పుచ్చు కున్నారో తాంబూలాలు – తెలేదు కానీ, ఏదో ఒక డేటు చెప్పి, ఆ రోజు నీ పెళ్లంటూ పత్రికలు అచ్చేయించడానికి వెళ్లిపోయారు పెద్దమనుషులు.

అప్పట్నుంచీ మొదలయ్యింది, కదన రంగంలో కాలుమోపుతున్న సైనికుడికిచ్చే సూచనల్లా – "ఆ వంట నేర్చుకో, ఇదిగో ఈ అంట్లు తోమటం ఇలా కాదు సరిగ్గా నేర్చుకో. సాధ్యమైనంత వరకూ అత్త గారింట్లో నోరు పిప్పకేం! అసలే కిర్సనాయిలుమోసి తగలబెట్టే కాలాలివి– ఈ కాలం మగవాళ్లకు... ఆ మాట కొస్తే ఏ కాలంలోనైనా వున్నారులే – అందుకే ఆడదానివి నీ జాగ్రత్తలో నీవుండాలి"

– ఇవన్నీ, విన్న నాకు 'పెళ్ళో జైలా?' అనిపి స్తోంది.

గొలుసులతో కట్టేసి, బలవంతంగా లాక్కెళ్లి వీళ్ళందరూ నన్నందులోకి తోసెయ్యట్లేదు కదా!

ఎదురింటి, పక్కింటి ఆంటీలందరూ వచ్చారు కట్టకట్టుకొని – పెళ్లి చీరలు చూడటానికి వచ్చిన వాళ్లు ఊర్కే చూస్తారా?

'కట్న కానుకలు ఏమాత్రమిస్తునారండీ?' – అడుగుతోంది ఎదురింటి గిరిజమ్మ.

'నగదు, బంగారం కలిపి ఒకటిన్నర లక్షండీ' – అమ్మ కించిత్ గర్వంగానే అంది.

'ఆ...హా! అలాగా... మా సైడు ఇంకా బాగాఎక్కువుంటాయండీ కట్నాలు అవీను. అట్లా పోల్చుకుంటే మీ సైడ్ చీపే' – అంటోంది కోస్తానుంచీ కొత్తగా బదిలీ అయివచ్చిన నీరజాక్షి.

ఏం తక్కువలెండి, పాపం ఒదిన గారికి ఎక్కువ రేటు పడ్డట్టే. ఇంతకు ముందు ఈ అబ్బాయి వాళ్లే మా అక్కగారి ఆడపడుచు కూతుర్ని యాభై వేలకే ఒప్పుకున్నారు. అంటే, పిల్ల వీళ్లమ్మాయి కవిత కన్నా మంచి కలరుకోండి. ఎందుకో ఆ సంబంధం కల్సి రాలే – అంటోంది మాకు మధ్యస్తం నడిపినాయన భార్య.

కట్నం! పిండి కొద్దీ రొట్టెలాగైపోయింది. రంగు–రంగుకో కట్నం! ప్రాంతానికీ – ప్రాంతానికో కట్నం! కులం– కులానికో కట్నం! పుట్టింటికీ – అత్తింటికీ మధ్య వారధిగా కట్నం.

కట్నంలేని పెళ్లి? పెళ్లిలేని మనుషులు? ఈ నాగరిక సమాజంలో సాధ్యమా? కట్నం తీస్కో కుండా ఓమగాడికి పెళ్లవుతుందేమో కానీ, ఓ ఆడపిల్లకు మాత్రం కాదు. ఆడపిల్లలోని వ్యక్తి త్వాన్ని, వ్యక్తి ఆశయాల్ని బహిర్గత పరచడానికి సంఘం ఏమాత్రం అవకాశమివ్వదు. అంతదాకా ఎందుకు? ఇంట్లో కుటుంబ సభ్యులే ఇవ్వరు. అందుకే 'ప్రతి సామాజిక సమస్యకు పుట్టిల్లు కుటుంబమే కావచ్చు!'

వచ్చిన వాళ్లు చీరలు చూసి వెళ్లిపోయారు. అమ్మ వంటింటి కేసి నడుస్తూ అంది – 'ఏమే, కవితా! పాత్రలు తోమి. పెట్టావా?

'ఊహు, లేదు' – అన్నాను.

'ఇంతింత కట్నాలిచ్చి, ఖర్చుపెట్టి పెళ్లిచేస్తుంటే, కనీసం మా ఇంట్లో వున్నవాళ్లు ఆ మాత్రం పనిచేయక పోతే ఎట్లాగే? ఎప్పుడూ పుస్తకాల్లో మునిగి తేలడమే కాని, పని ధ్యాసే లేదు నీకు. ఏం ఆడపిల్లలో ఏమో? కనడం – సాకడం – పెళ్లి చేసి పంపడం. ఏం ప్రయోజనం లేదు. ఖర్చు దండగ – అంటూ ఓ స్త్రీగా, ఓ మాతృమూర్తి ఆడపిల్ల పుట్టుక వల్ల కన్పించని ప్రయోజకత్వానికి పెదవి విరుస్తోంది.

ఎంత విచిత్రం? మనిషి పుట్టుక – పెళ్లి – చావు అన్నటి వెనుక వున్న వ్యాపార దృష్టి, మానవ సంబంధాలను ఏ స్థాయికి దిగజారుస్తుందో?

* * * *

పెళ్లి రెండ్రోజులుండనగా హడావుడిగా వచ్చాడు మధ్యవర్తి.

'అబ్బాయి స్కూటరు కావాలని పట్టుబట్టారండి. వాళ్ళ ఫ్రెండ్స్ అందరూ అతన్ని గేలి చేస్తున్నారంట. 'మీ మామ గారి చేత స్కూటరిప్పించుకోలేని వాడివి ఏం మగాడివోయ్?' అని కాబట్టి...

'ఊ కాబట్టి మేము తీసీయాలంటారా! మేం ఒప్పుకున్నవి మాత్రం మా శక్తి వంచన లేకుండా ఇస్తున్నాం. ముందే చెప్పాం కదండీ! స్కూటరు విషయం మా చేత కాదని ఆలా అయితే ఈ సంబంధమే ఒద్దనుకుండే వాళ్లం.' అలా అంటు న్నప్పుడు నాన్న మొహం ఎంత దీనంగా వుందో ముందెప్పుడూ నే చూడలేదు.

'అలా అనకండి బావ గారూ! అబ్బాయిది గవర్నమెంటు ఉద్యోగం. పైగా ఆస్తిపాస్తులుండి పాయె. ఏదో కుర్రాడు స్నేహితులతో గౌరవంగా చెప్పకోడానికి స్కూటరు కావాలంటున్నాడు. పైగా రేపొద్దున మీ కూతురు, అల్లుడు మీ కళ్ళముందు అలా స్కూటర్‌మీద తిరుగుతుంటే మీకు మాత్రం సంతోషం కాదూ. తప్పదండీ! ఆడపెళ్లి వాళ్లు ఆ మాత్రం సర్దుకోక పోతే, ఈ కాలంలో పెళ్ళిళ్లు ఎలా అవుతాయండీ? పైగా పీటల మీద ఆగిపోయే పెళ్ళిళ్లు ఎన్ని చూడ లేదు? మనం' అంటూ చెప్పకొస్తున్నాడు.

'అయ్యో, ఆ మాటనకండి అన్నయ్యగారు, పోన్లెండి, ఇదొక్క కోరిక తీరుద్దాం. లేకపోతే ఈ వంకతో అమ్మాయిని సాధిస్తే, బాధపడేది మనమే. మీరు మాత్రం పెళ్లినాడు సైకిలు కావా లని బెట్టు చేయలేదు. అవి సైకిలు కాలాలు – ఇవి స్కూటరు కాలాలు. అంతే తేడా! ఇంకేం మాట్లాడకండి' అంది అమ్మ.

ఒకనాటి అల్లుడు, ఇప్పుడు మామగా మారే సరికి అర్థమైపోతోంది పరిస్థితి. అల్లుళ్ల అలకను తీర్చడానికి అప్పచేయాల్సిన ఖర్మకు ఆ క్షణంలో ఎవర్ని తిట్టుకోవాలో బహుశా! నాన్నకు అర్థమ య్యుండదు. అదనంగా స్కూటరు కోసం మరో ఇరవై ఐదువేలంటే మాటలా! అయినా తప్పదు.

నాన్న ఏం మాట్లాడక పోయే సరికి, మౌనం అర్ధాంగీకారంగా తల్చుకుని చల్లగా వెళ్లిపోయాడు మధ్యవర్తి.

భారమైన వస్తువు ఏది? అటో – ఇటో వదిలించుకోవాలి లాంటి ధోరణి మా అమ్మా నాన్నల్లో స్పష్టంగా కన్పిస్తోంది. వియ్యంకుల లాలూ చీతనం, అవకాశవాదం అనుభవంలోకి వస్తున్నా, ఆ 'యిటికే' కూతుర్ని పంపడానికి మాత్రం వెనుకాడ్డం లేదు.

తన జీవితంలోకి ఓ కొత్త వ్యక్తిని ఆహ్వానించడా నకి కావాల్సింది ఖచ్చితంగా కట్నాలు, కానుకలే; ఎవరికోసం ఇస్తావ్? ఇయ్యకేం చేస్తావ్? ఆడపిల్లను కన్నందుకు ఇవ్వక ఎట్లా తప్పించుకుంటావ్? దౌర్జన్య ధోరణి పెళ్లికొడుకులది అయినప్పుడు, ఇట్లాంటి సమాజంలో 'స్త్రీనై' పుట్టినందుకు సిగ్గుతో తలవం చుకున్న నన్ను – ముడికో యాభైవేల జరిమానా అంటూ నా మెడలోని 'మూడుముళ్లు' తాళి రూపంలో ఎగతాళి చేస్తూ వెక్కిరిస్తున్నాయ్!

## ఎ.ఆర్.రెహమాన్ సంజాయిషీ!

తమిళనాడులో టెర్రరిస్టు కార్యకలాపాలకు తాను డబ్బు సాయం చేస్తున్నానని ఈ మధ్య పత్రికలలో వస్తున్న వార్తలు పూర్తిగా అవా స్తవం అని ఎ.ఆర్.రెహమాన్ చెప్తున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం తనకు టెర్రరిస్టుల నుంచి రక్షణ నిస్తుంటే తానే వాళ్లకు సాయం చేస్తున్నా నన్న అభియోగం పూర్తిగా అర్థంలేని విషయం అంటున్నాడు.

